# పుస్తక సమీక్ష

## సమాజాన్ని కదిలించే కథలు



బద్రి నర్సన్ వెలువరించిన తొలి కథా సంకలనం 'దారి తెలిసిన మేఘం'. ఇందులో 20 కథలు ఉన్నాయి. ప్రతి కథకు ఓ బలమైన నేపథ్యం ఉంది. ఈ కథలు కేవలం కాల క్షేపం కోసం రాసినవి కావు. సమాజంలోని తప్పొప్పులను, అసమానతలను కథాంశాలుగా తీసుకొని, వాటికి చక్కని పరిష్కారాలు సూచిస్తాయి. మరి కొన్ని పాఠకులను ఆలోచింపజేస్తాయి. స్త్రీల న్యాప్‌కిన్ చుట్టూ అల్లిన 'మరక మంచిదే' కథలో మూడు తరాల స్త్రీలు నెలసరి సమయంలో సమాజం నుంచి ఎదుర్కొన్న సమస్యలను దాపరికం లేకుండా చర్చించారు. దేశంలో ఖైదీలకు ఉరిశిక్ష అమలు చేసే తలారి బతుకులపై రాసిన కథ 'ఈ శిక్ష మాకొద్దు'. ఇది పాఠకులను ఆలోచింపజేస్తుంది. తెలుగులో తలారి జీవితాలపై వచ్చిన తొలి కథ ఇదే. నేటి అమాయక భక్తులను లక్ష్యంగా చేసుకొని వ్యంగ్యంగా రాసిన కథ 'కూటివిద్యలు'. ఆర్థికంగా చితికిపోయి దిక్కు తోచని స్థితిలో జాతకాలు చూసే వ్యక్తి సలహా ప్రకారం తనకున్న ఒక డొక్కు వాహనాన్ని 'రథం గుడి' గా మార్చుతాడు. అందులో దేవుళ్లను ప్రతిష్ఠించి, మైకులో భక్తి పాటలు వినిపిస్తూ వీధుల్లో తిరుగుతాడు. భక్తుల ఆదరణతో అతని ఆదాయం పెరిగి కష్టాలన్నీ తీరిపోతాయి. 'చావు-నీడ' కథలో వృద్ధాప్యంలో ఎదురయ్యే విషాద సంఘటనలకు కుంగిపోకుండా జీవితంలో చివరి క్షణం వరకు ఆశావహ దృక్పథం కలిగి ఉండాలని సందేశం ఉంది. ఇక 'పాలు మరచినవాళ్లు' కథ స్వార్థ బుద్ధితో కొడుకులు కన్నవాళ్లను తమ అవసరాలకు వాడుకొనే తీరు కళ్లకు కట్టినట్లుగా చిత్రిస్తుంది. మతాతీత సహజీవనంలో మతం కన్నా జీవితం ఉన్నతమైనదని 'దారి తెలిసిన మేఘం' కథ తెలియజేస్తుంది. బంధాలు - అనుబంధాలు, జానకి విముక్తి కథలు పడుపు వృత్తిలోని అనేక పార్శ్వాలను మన ముందు ఉంచుతాయి. వర శాపం, సుమిత్ర కథలు రెండూ స్త్రీ పురుషుల సంబంధాలను కొత్త కోణంలో చూపెడతాయి. ఇలా 'దారి తెలిసిన మేఘం' సంకలనంలో కథలన్నీ వాస్తవానికి, జీవితాలకు దగ్గరగా సాగుతాయి.

**దారి తెలిసిన మేఘం**

**రచన:** బద్రి నర్సన్
**పేజీలు:** 160, **ధర:** రూ. 150
**ప్రచురణ:** నీలమ్ పబ్లికేషన్స్
**ప్రతులకు:** నవోదయ బుక్ హౌజ్
**ఫోన్:** 9440128169

... జి. గంగాధర్

## ఘనం.. పీవీ వనం

### చింతలు తీర్చే చింత



చింతలేని మనిషి, చింత చెట్టు లేని ఊరు ఉండదు. గూగుల్ మ్యాప్ లేని రోజుల్లో చింతల తోపు, చింత చెట్టే చిరునామాలు. ఆ చింత చెట్ల కింద కూర్చుని చేసే ముచ్చట్లలో చింతలెన్నో చెప్పుకొనేవారు జనాలు. నిజానికి పేరులో 'చింత' ఉన్నా చింతలెన్నో తీర్చే చెట్టు ఇది. మా ఇంట్లో పెద్ద చింతచెట్టు ఉంది. ఆ చింతకొమ్మలు పెట్టుకుని ఉయ్యాల ఊగేవాళ్లం. చింతకాయలకు ఉప్పద్దుకుని తింటూ బడికి పోయేవాళ్లం. నాన్న (పూర్వ ప్రధాని పీవీ నరసింహారావు) గారికి చింతపండు తొక్కు ఎంతో ఇష్టమైన వంటకం. ఎర్రని మిరపపండుతో చింతకాయను కలిపి దంచితే చింతకాయ తొక్కు తయారవుతుంది. ఇది తెలంగాణ ప్రత్యేక వంటకం.

వృక్ష శాస్త్రంలో చింతచెట్టుని 'టామరిండస్ ఇండికా' అని పిలుస్తారు. ఈ పదం తమర్-ఐ-హింద్ అనే పర్షియా పదం నుంచి వచ్చింది. దీనికి అర్థం 'డేట్ ఆఫ్ ఇండియా' అని. దీని పండ్లు ఖర్జూరపు పండ్లను పోలి ఉంటాయి కాబట్టి ఇలా పిలిచారన్నమాట. ఆసియా ప్రాంతంలో ఉండే చింతకాయలు పొడవుగా అంటే 6 నుంచి 12 గింజలతో ఉంటే, ఆఫ్రికా జాతికి చెందినవి కాస్త పొట్టిగా 1 నుంచి 6 గింజలతో కాస్తాయి. ఈ చెట్టు సగటున 200 సంవత్సరాలు బతుకుతుంది. ప్రపంచవ్యాప్తంగా ఈ చెట్లు పెరుగుతాయి. గింజలు తీసిన చింతపండుని వంటల్లో వాడతారు. అదొక్కటే కాదు... చింత చిగురు, చింతపువ్వు, లేత చింతకాయలు, కండపట్టిన పచ్చి చింతకాయలనూ అనేక రకాల ఆహార పదార్థాల తయారీకి ఉపయోగిస్తున్నారు. చింత వేర్లు, ఆకులు, పండ్లు, గింజలు, బెరడులన్నింటినీ ఔషధాల తయారీలో ఉపయోగిస్తారు. పురుగు మందులు, విషంలాంటివి తాగిన వారికి విరుగుడుగా గ్రామాల్లో చింతపండు రసాన్ని పోస్తారు. చింత పండు జీర్ణశక్తిని పెంచుతుంది. కడుపు ఉబ్బరం, పచ్చ కామెర్లు, మశూచి రోగ చికిత్సలోనూ ఉపయోగపడుతున్నది. చికెన్ పాక్స్ వచ్చిన వారికి మచ్చలు తగ్గేందుకని ఒంటినిండా చింతపండు పులిమి స్నానం చేయిస్తుంటారు. చింతపండు ఆకలిని పుట్టిస్తుంది. పీవీ ఔషధ వనంలో నాలుగు చింతచెట్లు ఉన్నాయి.

■ ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, పీవీ కూతురు

## బుక్ షెల్ఫ్



### వెన్నెల కుప్పలు (పిల్లల పాటలు)

**రచన:** డా. ఎం. పురుషోత్తమాచార్య
**పేజీలు:** 48; **ధర:** రూ. 70
**ప్రతులకు: ఫోన్:** 93966 11905

### నౌకావలోకనం

**రచన:** శరద్యుతి
**పేజీలు:** 118; ధర: రూ. 200
**ప్రచురణ:** జేవీ పబ్లికేషన్స్
**ప్రతులకు:** నవోదయ బుక్ హౌజ్
**ఫోన్:** 90004 13413



(...13వ పేజీ తరువాయి)

**అది ఎవరు?**

### సమాధానం:

రామస్వామి ఫోన్‌లో.. స్నిగ్ధ హత్యకు గురైనట్టు మాత్రమే చెప్పాడు. అయితే, 'గన్ పౌడర్ శాంపిల్స్‌ని ఫోరెన్సిక్‌కి పంపించలేదా?' అంటూ గన్‌తో కాల్చడంవల్లే స్నిగ్ధ చనిపోయినట్టు పోలీసులు చెప్పకముందే నిఖిల్ చెప్పాడు. అలా దొరికిపోయాడు. కాగా, తాను పనిచేస్తున్న ప్రైవేట్ డిటెక్టివ్ ఏజెన్సీ వ్యక్తులు.. ఉగ్రవాదులతో చేతులు కలిపారని, సిటీలో బాంబుదాడులకు కుట్రపన్నారని నిఖిల్ పోలీసులకు చెప్పాడు. ఎక్కడెక్కడ బాంబులు పెట్టారు? అవి ఎప్పుడు పేలుతాయో మాత్రం తనకు తెలియదని, దానికి సంబంధించిన కోడ్ మాత్రం స్నిగ్ధకు తెలిసిందని పేర్కొన్నాడు. దీంతో ఆమెను చంపాలంటూ తనను పురమాయించారని, లేకపోతే తనను చంపుతామని బెదిరించారని చెప్పాడు. గత్యంతరం లేకనే స్నిగ్ధను చంపినట్టు పేర్కొన్నాడు. దీంతో ఉగ్రవాదుల స్థావరానికి బయల్దేరింది రుద్ర అండ్ టీమ్.